మరువ పారిన పరిగి చెరువు


మరువ పారుతున్న పరిగి చెరువు


నిండుకుండలా దర్శనమిస్తున్న పరిగి చెరువు

- చెరువు కింద 3 వేల ఎకరాలకు పైగా ఆయకట్టు
- తాగు, సాగు నీటికి ఇబ్బంది ఉండదని ప్రజల హర్షం
- చెరువు మునక ప్రాంతంలో పంటలకు భారీగా నష్టం

పరిగి: జిల్లాలోనే అతి పెద్ద చెరువుల్లో ఒకటైన పరిగి పెద్ద చెరువు జలకళ సంతరించుకుంది. ఎగువన ఉన్న కర్ణాటక ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో జయ మంగళి నది గత కొన్ని రోజులుగా ఉధృతంగా ప్రవహిస్తోంది. శ్రీరంగరాజుపల్లి వద్ద నదికి అడ్డంగా నిర్మించిన పాయకట్ట వద్ద నుంచి డైవర్షన్ కెనాల్ ద్వారా పరిగి చెరువుకు నీరు భారీగా వచ్చి చేరుతుండటంతో పరిగి చెరువు నిండి నీటితో కళకళలాడుతోంది.

ఆనందంలో ఆయకట్టు రైతులు

పరిగి పెద్ద చెరువు నిండటంతో తాగు, సాగు నీటి ఇబ్బందులు తప్పినట్లేనని ఉండవని మండల ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువు విస్తీర్ణం 2,655 ఎకరాలు కాగా ఆయకట్టు 2,851 ఎకరాలుగా ఉంది. అనధికారికంగా మరో 400 ఎకరాలు ఉంటుంది. ఆయకట్టు కింద పంటల సాగుకు అవకాశం వచ్చిందని అన్నదాతలు చెబుతున్నారు. భూగర్భజలాలు భారీగా పెరగ్గా వంద అడుగుల్లోనే బోర్లలో నీరు వచ్చే పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా తహసీల్దార్ హసీనా సుల్తానా, ఎస్ఐ రంగడు యాదవ్, ఇతర అధికారులు శుక్రవారం చెరువు పరిసరాలను పరిశీలించాను. ఎవరూ ఈతకు వెళ్లకుండా, మరువద గ్గరకు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

పలువురు రైతులకు నష్టం

పరిగి పెద్ద చెరువు మరువ పారుతుండటంతో చెరువు మునకలో ఉన్న మండలంలోని 14 పంచాయతీల్లో శ్రీరంగరాజుపల్లి, హొన్నంపల్లి, శిరేకోళం, పరిగి తదితర గ్రామాలకు చెందిన పలువురు రైతుల పంటలకు నష్టం వాటిల్లింది. వందలాది ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న, మిరప, పత్తి, మల్బరీ తదితర పంటలు నాశనం అయ్యాయి. దీంతో లక్షలాది రూపాయలను నష్టపోయారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

హంద్రీనీవాను ఆధునికీకరించాలి



దాదాపు 3 వేలకు పైగా ఆయకట్టు ఉన్న పరిగి చెరువు నిండటం సంతోషం. అయినప్పటికీ వ్యవసాయాన్ని చేసే రైతులకు ప్రోత్సాహక పరిస్థితులు ప్రభుత్వం కల్పించాలి. పూడిపోయిన హంద్రీనీవా కాలువను ఆధునికీకరించి జిల్లాలోని చెరువులన్నింటికీ కృష్ణా జలాలతో నింపాలి. రైతాంగాన్ని ఆదుకోవాలి.

– ధనాపురం వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర రైతు సంఘం నాయకుడు, పరిగి

ముంపు బాధితులను ఆదుకోవాలి



పరిగి చెరువు నిండి మరవ పారడం సంతోషమే. అయితే పరిగి రెవెన్యూ గ్రామ పరిధిలో ఎకరం రిజిస్టర్ భూమితో పాటు సాగుబడి పట్టా ఉన్న రెండెకరాల్లో రూ.లక్ష వెచ్చించి మొక్కజొన్న సాగు చేశారు. పరిగి చెరువు నిండటంతో మూడెకరాల్లోని పంటంతా మునిగిపోయింది. ముంపు పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలని కోరుకుంటున్నాము.

– కిరణ్, రైతు, శ్రీరంగరాజుపల్లి, పరిగి మండలం

నేడు మండల మీట్

అమరాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రామరావు తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు నివేదికతో హాజరు కావాలన్నారు. అదేవిధంగా ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు తప్పక హాజరు కావాలని కోరారు.

అగళి: మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ యాదవేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రేణుక అధ్యక్షతన ఉదయం 10:30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

నేడు చేపల చెరువు వేలం

గుడిబండ: మండల కేంద్రంలోని గుడిబండ చెరువులో చేపల పెంపకానికి పంచాయతీ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి ప్రకాష్ తెలిపారు. ఆస్తకి గల వారు రూ.10 వేల డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

అగంతకుల నుంచి రక్షణ కల్పించండి

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని నక్కలగుట్ట కాలనీలో సంచరిస్తున్న అగంతకుల నుంచి రక్షణ కల్పించాలని స్థానికులు కోరారు. శుక్రవారం కాలనీకి చెందిన వెంకటేశ్, ప్రభాకర్, బాబు, ఓబులేసు విలేకరులతో మాట్లాడారు. పది రోజుల నుంచి ఐదు ఇళ్లలో చోరీలు జరిగాయన్నారు. అర్ధరాత్రి ద్విచక్ర వాహనాల్లో గుర్తు తెలియని వ్యక్తుల వచ్చి బెదిరిస్తున్నారని చెప్పారు. గురువారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాల్లో వచ్చిన వారిని ప్రశ్నించగా దురుసుగా ప్రవర్తించారన్నారు. గ్రామంలో గంజాయి వినియోగం ఎక్కువ కావడంతో యువకులు ఇలా ప్రవర్తిస్తున్నారని, పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా గస్తీ ముమ్మరం చేసి చర్యలు చేపడతామని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

క్లుప్తంగా

ఘనంగా ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కేశవరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్‌తో పాటు పలువురు అధ్యాపకులు ప్రసంగించారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టిశ్రీరాములు అని ప్రశంసించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ జయప్ప, ప్రతాప్, రామన్న తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

అందరికీ ఆదర్శప్రాయుడు వాల్మీకి


వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న నాయకులు

అమరాపురం: అందరికీ ఆదర్శ ప్రాయుడు వాల్మీకి మహర్షి అని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎంపీపీ ఈరన్న పేర్కొన్నారు. శుక్రవారం అమరాపురం మండలం విరుపసముద్రం గ్రామంలో వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో వారు పాల్గొన్నారు. ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క వాల్మీకి విగ్రహం వద్ద పూజలు చేశారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

పరిగి: స్థానిక అవసరాలకు కాకుండా ఇతరత్ర ప్రాంతాలకు ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హసీనా సుల్తానా తెలిపారు. మండలంలోని పెన్నా, జయమంగళి నదుల నుంచి ఎలాంటి రాయల్టీ చార్జీలు లేకుండా స్థానిక అవసరాలకు మాత్రమే ఉచితంగా ఎడ్ల బండ్లలో, ట్రాక్టర్లలో ఇసుక రవాణా చేసుకోవచ్చన్నారు. రైతులు తమ పట్టా భూముల, డీకేటీ పట్టా భూములలో ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేయాలనుకుంటే జిల్లా మైనింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కార్మికుల హక్కులను సాధించుకుందాం


ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పరిగి: కార్మికుల హక్కులను సాధించుకుందామని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని కొడిగెనహళ్లి ప్రీకాట్ మిల్లు వద్ద గురువారం ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి మారుతీరెడ్డి, ఉపాధ్యక్షుడు రవికుమార్, కోశాధికారి బాబుతో పాటూ మిల్లులోని ఏఐటీయూసీ కార్యవర్గ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా కన్నడ రాజ్యోత్సవం


పావగడ: ప్రముఖులను సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: స్థానిక మహాత్మగాంధీ స్టేడియంలో కన్నడ రాజ్యోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ కన్నడ పతాకాన్ని ఆవిష్కరించారు. తహసీల్దార్ వరదరాజు మాట్లాడుతూ ఆంధ్ర సరిహద్దు లోని పావగడ తాలూకాలో కన్నడ భాష అభివృద్ధి కి కన్నడ పర సంఘాలు పాటు పడాలన్నారు. ఎమ్మెల్యే వెంకటేశ్ మాట్లాడుతూ కన్నడ భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులై కృషి చేయాలన్నారు.

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురంలో కన్నడ రాజ్యోత్సవాన్ని ఆంధ్రప్రదేశ్ గడినాడు కన్నడ కమిటీ సభ్యులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. గడినాడు కన్నడ కమిటీ కార్యదర్శి జయశంకర్, జయదేవమూర్తి, నిరంజన్ తదితరులు కన్నడ రాజ్యోత్సవం సందర్భంగా దీపాలు వెలిగించి సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా కన్నడ విశిష్టతను తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు విశ్వేశ్వర బాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన కొండూరు విద్యార్థులు

లేపాక్షి: అనంతపురంలో అక్టోబర్ 24న జరిగిన జిల్లా స్థాయి నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి కొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శేషగిరిబాబు, ఫిజికల్ డైరెక్టర్ శివకుమార్ తెలిపారు. కే.నాని , కే.నవ్య మెయిన్ టీంకు, నిహారిక స్టాండ్ బైగా ఎంపికై నట్లు పేర్కొన్నారు. గాజువాకలో ఈనెల 9, 10, 11 తేదీల్లో జరిగే పోటీల్లో వారు పాల్గొంటారని పేర్కొన్నారు. అలాగే లేపాక్షిలోని ఎస్ఎస్ఆర్ఓ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రేఖ, మనోజ్‌లు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయుడు వీవీసీ గిరి, ఫిజికల్ డైరెక్టర్ సురేష్ తెలిపారు. ఈనెల రెండో తేదీ నుంచి అనకాపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అదే విధంగా జస్సుప్రియ రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎన్నికై నెల్లూరులో ఈనెల 2న జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు.

4న ట్యాంక్ వేలం

లేపాక్షి: లేపాక్షిలోని బసవన వీధి పాఠశాల ఆవరణలో శిథిలావస్థకు చేరుకున్న నీటి ట్యాంక్‌ను ఈనెల 4వ తేదీన వేలం వేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనే పాటదారులు పంచాయితీ నిర్ణయించిన ధరావత్తును చెల్లించాలన్నారు.

ఎంఆర్ఐగా వెంకట్‌పాల్



అమరాపురం: మండల తహసీల్దార్ కార్యాలయంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా శుక్రవారం వెంకట్‌పాల్ బాధ్యతలు చేపట్టారు. మండలంలోని రైతులకు అందుబాటులో ఉండి రైతులు, ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు.

జగన్‌ను కలిసిన నాయకులు


జగన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, నాయకులు

పెనుకొండ రూరల్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ గురువారం బెంగళూరు ఎయిర్‌పోర్టులో మర్యాద పూర్వకంగా కలిశారు. పెనుకొండ నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులను జగన్‌కు పరిచయం చేశారు.


వైఎస్ జగన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌ను గురువారం పులివెందులలో మడకశిర వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప కలిశారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి ఎలా ఉందని వైఎస్ జగన్ అడిగి తెలుసుకున్నట్లు ఈరలక్కప్ప 'సాక్షి'కి తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాడి తద్వారా పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించినట్లు పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

- ముగ్గురికి తీవ్ర గాయాలు

గోరంట్ల: మండల పరిధిలోని పాలసముద్రం సమీపంలో గోరంట్ల మలుపు వద్ద శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ బాబు వివరాలమేరకు.. రొద్దం మండలం మరువపల్లి గ్రామానికి చెందిన సోముశేఖర్, పావగడకు చెందిన మధు, హరి ద్విచక్ర వాహనంలో గోరంట్ల నుంచి పెనుకొండ వైపు వెళ్తుండగా పాలసముద్రం సమీపంలో జాతీయ రహదారి వద్ద రోడ్డును క్రాస్ చేస్తుండగా అనంతపురం వైపు నుంచి బెంగళూరు వెళ్తున్న లారీ ఢీ కొంది. ఘటనలో సోముశేఖర్, మధు, హరి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పోలీసు వాహనంలో గోరంట్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పులేరు సమీపంలో మరో ముగ్గురు..

గోరంట్ల మండల పరిధిలోని పులేరు సమీపంలో గోరంట్ల – పులేరు ప్రధాన రహదారిపై శుక్రవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో శెట్టి చిన్నంపల్లి కి చెందిన రామాంజినేయులు, ఆయన భార్య సరస్వతితో పాటు గోరంట్లకు చెందిన కొండప్ప గాయపడినట్లు ఎస్ఐ బాబు తెలిపారు.శెట్టిచిన్నంపల్లికి రామాంజినేయులు, సరస్వతి ద్విచక్ర వాహనంలో గోరంట్ల వైపు వస్తున్నారు. అయితే గోరంట్ల వైపు నుంచి పులేరు వెళ్తున్న కొండప్ప ద్విచక్ర వాహనం పులేరు సమీపంలో మలుపు వద్ద ఢీకొంది. ఘటనలో రామాంజినేయులు, సరస్వతి తీవ్రంగా గాయపడ్డారు. కొండప్ప స్వల్ప గాయలతో బయటపడ్డాడు. క్షతగాత్రులను గోరంట్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ముగ్గురు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

పావగడ: స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చెందిన ముగ్గురు కానిస్టేబుళ్లు శ్రీకాంతనాయక్, నటేశ్, సంతోష్‌కుమార్ సస్పెన్షన్‌కు గురయ్యారు. తుమకూరు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు గురువారం వారిని సస్పెండ్ చేశారు. పలువురు జూదగాళ్లతో సన్నిహిత సంబంధం ఉన్నట్లు ఎస్పీ విచారణలో రుజువు కావడంతో వారిపై వేటు పడినట్లు సమాచారం.

డైరెక్టర్ స్థానానికి నామినేషన్ దాఖలు

పావగడ: స్థానిక తుమకూరు జిల్లా సహకార పాలు ఉత్పత్తి దారుల సంఘాల కూటమి (తుముల్) డైరెక్టర్ స్థానానికి తాలూకాలోని బెళ్లిబట్లు గ్రామానికి చెందిన కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖరరెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేశ్ సమక్షంలో జిల్లా ఉప విభాగాధికారుల కార్యాలయంలో చంద్రశేఖరరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు.

హోటళ్లలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు


కవర్లను పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తస్లీమా

హిందూపురం: పట్టణంలోని పలు హోటళ్లలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తస్లీమా శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద వైశాలి హోటల్ వద్ద ఇడ్లీ పదార్థాలు సేకరించి, హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు తరలించారు. సీ అండ్ ఐజీ చర్చి ఎదురుగా ఉన్న క్యాంటీన్‌లో సిద్ధం చేసి ఉంచిన అన్నాన్ని పరిశీలించారు. పరీక్షల నిమిత్తం కొంత సేకరించి ల్యాబ్‌కు పంపారు. వీడీ రోడ్డు లోని ఓ టిఫిన్ సెంటర్‌ను పరిశీలించారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో వెంటనే అనుమతులు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ప్లాస్టిక్ కవర్లలో వేడి వేడి ఆహార పదార్థాలు ఇవ్వరాదన్నారు. ఆహార పదార్థాల పార్శిల్‌కు కంటైనర్లను మాత్రమే ఉపయోగించాలని సూచించారు.

ఆలయ పరిసరాలు శుభ్రంగా ఉంచండి


ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ: ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖామంత్రి సవిత అధికారులను ఆదేశించారు. కార్తీక మాసం నేపథ్యంలో శుక్రవారం మంత్రి సవిత ఐముక్తేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అసౌకర్యానికి గురికాకుండా పట్టణంలోని ఆలయాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు.

ఇసుక రవాణాను అడ్డుకున్న రైతులు

రొద్దం: పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణా పెద్ద ఎత్తున సాగుతోందని రైతులు వాపోతున్నారు. మండల కేంద్రంలోని పెన్నానది పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక ట్రాక్టర్లను శుక్రవారం పలువురు రైతులు అడ్డుకున్నారు. ఇసుక తరలిస్తున్నారని, పోలీసులు, రెవెన్యూ అధికారులకు తెలిసినా వారు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పోలీసు అమరవీరులకు ఘన నివాళి


కొవ్వొత్తులతో మానవహారం నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

పెనుకొండ: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి పోలీసులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సర్కిల్లో పోలీసులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున కొవ్వొత్తులు ప్రదర్శిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ సర్కిల్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, కియా ఎస్ఐ రాజేష్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

పోలీస్ అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా స్థానిక మడకశిర రోడ్డులోని ఖమ్రూద్దీన్ అలీ ట్రస్ట్ కార్యాలయ ఆవరణలో పోలీసుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రక్తదాన శిబిరం నిర్వహించారు. గురువారం ఉదయం జరిగిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన యువకులు, పోలీస్ సిబ్బంది, సీఐ, ఎస్ఐలు రక్తదానం చేశారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

యోగనారాయణసేవా సమితి అన్నదానం

హిందూపురం: హిందూపురం యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిత్యాన్నదానం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రైల్వేరోడ్డులోని సాయిబాబా ఆలయం ఎదుట అన్నదానం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దాతల సహకారంతో సుమారు 300 మందికి అన్నదానం చేసినట్లు సమితి అధ్యక్షులు రవిశంకర్ తెలిపారు.


హిందూపురం: దీపావళి సందర్భంగా కాకర పూలు కాలుస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక


రొద్దం పెద్దాంజనేయస్వామి దేవాలయంలో ఓం ఆకారంలో దీపాలు వెలిగించిన మహిళలు


హిందూపురంలోని చైతన్యనగర్‌లో కాకర పూలు కాలుస్తున్న బాలికలు


హిందూపురం: లక్ష్మీదేవి పూజ చేసిన దృశ్యం


పావగడ: ప్రత్యేక అలంకరణలో కాళికాదేవి

దీపావళి వెలుగులు

సాక్షిబృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో దీపావళి పండుగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ టపాసులు కాల్చారు. ముఖ్యంగా వ్యాపారులు భక్తిశ్రద్ధలతో లక్ష్మీపూజ నిర్వహించారు. అన్ని ఆలయాల్లో ఉదయం నుంచే ప్రత్యేక పూజలను చేశారు.


అగళి మండలం మధూడిలో ..


మడకశిరలో బాణసంచాను కాలుస్తున్న దృశ్యం

దుర్గాదేవి పూజలు

లేపాక్షి: ప్రముఖ పర్యాటక కేంద్రమైన లేపాక్షి వీరభద్రస్వామి ఆలయంలో వెలసిన దుర్గాదేవి అమ్మవారికి శుక్రవారం అమావాస్య కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.